# ... నడిపిస్తే నడిచి

**చా**లా కాలమయింది వెంకటరత్నం ఇంటికి వెళ్లక! దగ్గర వూరే! రెండు గంటల ప్రయాణం అంతే! అయినా కుదరలేదు! వెళ్లక పోవటానికి ప్రత్యేకంగా కారణాలంటూ ఏమీ లేవు! ఆ వైపు పని పడలేదంతే. వెంకటరత్నం ఊరికి వెళ్ళకపోయినా, అడపా దడపా మేము కలుస్తూనే ఉన్నాం. స్పాట్ వాల్యుయేషన్ సెంటర్‌లోనో, జిల్లా పరిషత్ ఆఫీసు దగ్గరో, కలసినప్పుడల్లా పాత సంగతులన్నీ గుర్తుకు తెచ్చుకొనే వాళ్లం!

కుటుంబ సభ్యుల గురించి పరామర్శలు చేసుకునే వాళ్లం. పాతికేళ్ల క్రితం, ఒక హైస్కూలులో ఐదేళ్లపాటు కలిసి పనిచేసిన బాంధవ్యం, స్నేహం మమ్మల్నింకా అంతో యింతో సజీవంగా కలిపే వుంచుతున్నాయి.

ఒకే హైస్కూల్‌లో పనిచేసే రోజుల్లో, పని చేసే పల్లెలోనే కాపురాలుండే వాళ్లం. మా ఇద్దరి కుటుంబ సభ్యులకూ చెప్పుకోదగినంత స్నేహం కూడా ఉండేది. తరచూ ఒకరింటికి ఒకరు వస్తూ పోతూ ఉండేవాళ్లం.

మా ఇద్దరివీ గ్రామీణ మధ్యతరగతి వ్యవసాయ కుటుంబాలే కావటం వల్ల కూడా మా స్నేహంలో అంతరాలుండేవి కావు. అతి సాధారణమైన జీవితానికి అలవాటు పడిన వాళ్లం కావడాన ఒక సంస్కారబంధం మమ్మల్ని మరింత దగ్గర చేసింది. వచ్చే జీతంతో పొదుపుగా ఏ ఆడంబరాలూ అంటకుండా జీవితాలను గడిపే రోజులవి. అతడి పిల్లలూ, మా పిల్లలూ మేము పని చేసే హైస్కూల్‌లోనే చదివే వాళ్లు. పైసా ఖర్చులేకుండా చదువును కొనసాగించే రోజులవి.

వెంకటరత్నంకు ఇద్దరు కొడుకులూ, ఒక కూతురూ. ఉన్నంతలో అందరూ బాగా చదువుకున్నారు. ఒక కొడుకు బి.ఏ. బియిడి. పూర్తిచేసి లెక్కల టీచర్‌గా స్థిరపడినాడు. మరో కొడుకు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కూతురు డిగ్రీ దాకా చదువుకుంది. అందరికీ పెళ్లిళ్లయినాయి. వాళ్ల పెళ్ళిళ్లకు మేము వెళ్లి వచ్చినాము కూడా. ఇప్పుడు వెంకటరత్నం రిటైర్ అయినాడు. నేను కూడా రిటైర్ అయి నాలుగేళ్లు దాటింది.

ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు వెంకటరత్నం వుండే వూరికి తప్పనిసరిగా వెళ్లాల్సిన పని ఒకటి పడింది. అక్కడ ఒక కుటుంబ పంచాయితీకి పెద్దగా నేను వెళ్లి తీరాల్సిన పని. ఫోన్ చేసి వస్తున్నట్టుగా తెలియచేసినాను. వెంకటరత్నం ఆ వూళ్లోనే పెద్దకొడుకుతో పాటు స్వంత యింట్లో వుంటున్నాడని నాకు తెలుసు.

నేను స్టాండ్‌లో బస్సు దిగేసరికి నా కోసమే ఎదురు చూస్తూ నిలబడి వున్నాడు వెంకటరత్నం...తన స్కూటర్ మీద నన్నెక్కించుకొన్నాడు.

ఐదు నిమిషాల్లో తన యింటి ముందు స్కూటర్ నిలబెట్టాడు...టౌన్ చివర్లో అప్పుడప్పుడే అభివృద్ధి చెందుతున్న 'పోష్' కాలనీలా ఉంది ఆ యేరియా. నీట్‌గా వేసిన రోడ్లూ, బారులు తీరిన పెద్ద పెద్ద ఇళ్లూ, ప్రతి ఇంటికీ కాంపౌండూ, ఇంటి ముంగిళ్లలో పచ్చని చెట్లూ–

వెంకటరత్నం ఇల్లు పెద్దదే. ఇంటి చుట్టూ కాంపౌండు, గేటు తీసి లోపలకు అడుగుపెట్టగానే సన్నటి దారీ, దారి కటూ యిటూ పూల చెట్లూ. కాంపౌండుకూ ఇంటికీ పది గజాల మేర ఖాళీస్థలమూ, ఆ స్థలంలో మట్టసంగా పెరిగిన, సపోటా దానిమ్మ జామ లాంటి ఫలవృక్షాలూ, ఒక వైపున పార్క్ చేసివున్న చిన్నకారూ – నా మిత్రుని ఇంటికి కాక, ఎవరో సంపన్నుని ఇంటికి వచ్చిన అనుభూతి కలిగింది నాకు. ఏదో స్వంత యిల్లు కట్టుకొన్నాడు అంటే, మా ఇంటిలాగే చాలా సాధారణమైన ఏ రెండు మూడు గదుల ఇల్లో అనుకున్నానుగాని, ఇలాంటి ఒక దివ్య భవనమనుకోలేదు నేను. బహుశా వెంకటరత్నం కొడుకు తన అభిరుచులకు అనుగుణంగా కట్టుకున్న ఇల్లేమో అని సమాధాన పడినాను–

కాని అది ఒక టీచర్ యిల్లు అంటే నాకు నమ్మశక్యం కాలేదు. మనసులో ఏవేవో ఆశ్చర్యాలూ, సందేహాలూ!

తలుపు ముందు నిల్చుని కాలింగ్ బజర్ నొక్కినాడు వెంకటరత్నం. తలుపు తెరుచుకుంది. ఎదురుగా వెంకటరత్నం భార్య. చూడక చాలా ఏళ్లయినా గుర్తుపట్టి బావున్నారా అన్నయ్యా అంటూ పరామర్శ చేసింది. లోపల విశాలమైన హాలు. హాలు మధ్యలో మూడు వైపులా పెద్ద సోఫాలు. సోఫాల మధ్య అద్దాల టీపాయ్. సోఫాల్లో కూర్చున్నాము. నేను ఒక్కసారిగా హాలునంతా కలయ చూసినాను.

హాల్లోంచే, ఓ మూల వయ్యారంగా వంపులు తిరిగిన మేడమెట్లూ. తలయెత్తి పైకి చూస్తే తప్ప కన్పించని రూఫింగూ, రూఫింగ్ నుండి వేలాడుతున్న రెండు పెద్ద

ఫ్యాన్లూ, హాల్లో నుండి మూడు వైపులా మూడు గదులున్నట్లు కన్పిస్తున్న కర్టెన్లూ, గోడలకు పెద్ద పెద్ద షోకేస్‌లూ, వాటిల్లో అమర్చిన విలువైన అందమైన ఆడంబరమైన రకరకాల వస్తువులూ. చూడగా చూడగా అదో ఇల్లులా కన్పించలేదు నాకు. టీవీ సీరియళ్లలో కనిపించే సంపన్న గృహస్థుల ఇల్లులా వుంది.

నాకు నా ఉపాధ్యాయ మిత్రుడైన వెంకటరత్నం ఇంటికి వచ్చినట్టుగా లేదు. పాతికేళ్ల క్రితం ఒక పల్లెలో కాపురమున్న అద్దె ఇల్లు ఎక్కడ? ఈ అద్భుత సౌధమెక్కడ? ఈ కొద్ది సమయంలోనే వెంకటరత్నం మానసికంగా నాకు కొంత దూరమైనట్టు ఒక అశాంతి లాంటిదేదో నా మనసును కమ్ముకుంది –

నేనింకా ఆ ఇంటి సౌందర్యాన్నీ, సౌభాగ్యాన్నీ కళ్లప్పగించి చూస్తుండగానే వెంకటరత్నం భార్య నా చేతికి కాఫీ కప్పు అందించి, ఎదురుగా ఉన్న సోఫాలో వెంకటరత్నం పక్కన కూచుంది. నేను కాఫీ తాగే పనిలో ఉండగా, ఆమె మా కుటుంబ సభ్యులందర్నీ పేరు పేరునా విచారించింది. వదిన ఎలా ఉంది? కొడుకూ కోడలూ ఎక్కడున్నారు? కూతురూ అల్లుడూ బావున్నారా? మనవలెంతమంది? ఇలాంటి ప్రశ్నలడుగుతూ ఉంటే నేను పొడి పొడిగా జవాబులు చెబుతున్నానేగాని ఇప్పటి వెంకటరత్నాన్ని ఎలా అంచనా వేయగలనా అనే దిగ్భ్రమలోనే మునిగి పోయినాను–

నేనూ ఇల్లు కట్టుకున్నాను. కాని ఈ సౌధంతో పోలిస్తే నాది ఇల్లే కాదు. మూడు అగ్గిపెట్టెలు మాత్రమే. అకస్మాత్తుగా ఏదో సంపద ఉరిమి ఉరిమి మీద పడితే తప్ప ఇటువంటి సుందర సౌధం రూపు దాల్చదు.

నా ముఖ కవళికల్ని బట్టి నా ఆలోచనల్ని పసిగట్టినాడేమో మరి, వెంకటరత్నం "ఏం గంగాధరం! మా ఇల్లు చూసి ఆశ్చర్యపోతున్నావా?" అని చిరునవ్వుతోనే ప్రశ్నించాడు. నేను వెంటనే జవాబు చెప్పలేదు. నాలుగైదు నిమిషాలాగి, "అవును రత్నం. నేను ఏ మాత్రం ఊహించని పరిణామం ఇది. ఈ ఇల్లు నీదేనా? లేదా ఎవరేనా విదేశాలకు వెళ్తూ నీకప్పగించి వెళ్లినారా?" అంటూ ఉత్సుకత ధ్వనించే గొంతుతో అడిగాను.

"నిజంగా మాదే గంగాధరం. మాదే అంటే కొంత అవాస్తవమౌతుంది. నా కొడుకుది అంటే మాత్రం పచ్చి నిజమౌతుంది" అన్నాడు. వెంటనే వెంకటరత్నం భార్య ముఖంలో కొంచెం చిరాకూ, కోపమూ కన్పించినాయి.

"చూడన్నయ్యా. తన ఇల్లు కాదు తన కొడుకు ఇల్లు అంటున్నారు. ఎవరేనా నవ్విపోరా ఈ మాటకు! ఆయన మాటలకేం లెండి – ఇది మా ఇల్లే" అంది హుందాగా నవ్వుతూ.

"సరేగాని ముందు భోజనాల ఏర్పాట్లు చూడు. భోంచేసి పనిమీద బయటకు వెళ్లి వస్తాడు" అన్నాడు వెంకటరత్నం.

'అదెంతసేపు' అంటూ ఆమె లేచింది.

వెంకటరత్నం లేస్తూ "పైన మేడ మీద నా గది ఉంది. అక్కడ కూచుందాం" అన్నాడు.

మేడ మీద మూడు పెద్ద గదులున్నాయి. మేము కూర్చున్న గది చాలా విశాలంగా ఉంది.

నేనింకా విచికిత్సలోనే వున్నాను. సాధారణ ఉపాధ్యాయుడుగా రిటైర్ అయిన వెంకటరత్నమెక్కడ? బి.యిడి. టీచర్‌గా పని చేస్తున్న అతని కొడుకెక్కడ? ఈ ఇల్లెక్కడ? అసలింత ఇల్లు వీళ్లకు అవసరమా? పైగా ఇంటి ముందు కారొకటి. ఇంత మొత్తం ఎప్పుడు సంపాదించారు?. ఎలా సంపాదించగలిగారు? అకస్మాత్తుగా ఊడిపడిన సంపదలేమైనా ఉన్నాయా? వెంకటరత్నాన్ని ఎలా అడగాలి?

నా ఆలోచనల్ని నా మౌనంలోనే వెంకటరత్నం పసిగట్టినట్టున్నాడు. "చూడు గంగాధరం! నీ మౌనమే నాకు చాలా ప్రశ్నలు వేస్తున్నట్టుగా ఉంది. ఈ వెంకటరత్నం ఏమిటి? ఈ ఇల్లూ, ఈ డాబూ దర్పమూ ఏమిటి? అనేగదా నీ అనుమానం" అంటూ మొదలు పెట్టినాడు.

నేను కొంచెం సర్దుకున్నాను. "పదేళ్లకు పైగానే అయింది నీ జీవితంలోకి తొంగి చూడక. అందువల్లనే నేను అబ్బురపడి పోతున్నానేమో? తరచుగా మన సంబంధాలు కొనసాగుతూ ఉంటే దీన్ని ఆకస్మిక పరిణామమని అనుకొనే వాడిని కానేమో" అన్నాను.

వెంకటరత్నం కొంచెం సేపు మౌనంగా, నిర్లిప్తంగా వుండిపోయాడు–"గంగాధరం! పాతికేళ్ల క్రితం మనం ఎలా ఉండేవాళ్లం? నీ జీవితమూ, నా జీవితమూ పూర్తిగా తెరచిన పుస్తకాలే. నువ్వు ఉద్యోగంలో చేరిన ఇరవై ఏళ్ల తర్వాత ఒక ఫ్యాన్ కొని సంబరపడి పోయిన సంగతి ఇప్పటికీ నాకు గుర్తే! నేను రెండు మంచాలూ, ఒక టేబులూ, నాలుగు కుర్చీలూ, ఒక ఫ్యానూ లాంటివి సమకూర్చుకోవటానికి పదేళ్లకు పైనే పట్టింది. అవునా?" అంటూ నా ముఖంలోకి చూశాడు.

కాదని నేనెలా అనగలను? అప్పట్లో మాకు వచ్చే జీతాలు తిండీ బట్టా, పిల్లల చదువులూ, ఆరోగ్యాలూ, చిన్నచిన్న వేడుకలకు బొటాబొటీ సరిపొయ్యేవి. మాకు పెద్ద ఆశలూ వుండేవి కావు. తక్కువ జీతాలుండటం వల్లే మా కోరికలు పరిమితంగా వుండేవేమో! మాకు కొనుగోలు శక్తి లేకపోవటం వల్ల, మమ్మల్ని ప్రలోభపెట్టే మార్కెట్ లేకపోవటం వల్ల కూడా మా జీవితాలు ఆడంబరంగా లేకపోయినాయేమో!

వాటితో పాటు మమ్మల్ని నడిపించే ఏదో ఒక సంస్కారం కూడా పని చేస్తూ వచ్చిందేమో! సామాజిక వినయమూ, నిరాండరత్వమూ, నూతన ప్రియాటోపం లేకపోవటమనేది ఆనాటి సామాజిక ఆర్థిక శక్తులలో ఒక భాగం కావటం వల్లనేమో, మేమెప్పుడూ మా జీవనశైలి పట్ల అసంతృప్తిని పొందలేదు.

ఇంతలో సెల్‌ఫోన్ మోగిన శబ్దం. వెంకటరత్నం చొక్కా జేబులోంచి సెల్ తీసి ఆన్ చేసి చెవికి చేర్చుకున్నాడు–

"ఆ...అవును...మొన్న హైదరాబాద్ వెళ్లినాడు... రేపు రావచ్చు... సరే...సరే... రాగానే చెబుతాను... అలాగే...అలాగే..." అంటూ ఫోన్ కట్ చేశాడు.

మళ్లీ జేబులో సెల్ పెట్టుకుంటూ "ఔను గంగాధరం నీ అనుమానాలను ఇంకా నేను తీర్చనే లేదు. నిన్ను చూస్తుంటే మన వెనుకటి రోజులన్నీ గుర్తుకొస్తూ వున్నాయి. జీవితపు సన్నని సందులకే ఆకర్షణ అప్పుడు మనకు. ఇప్పటిలాగా అప్పట్లో మనుషుల్ని నడిపించే తీవ్రస్థాయిలో లేవు మార్కెట్ శక్తులు. ఏదీ పని గట్టుకొని మన చేత పరుగులు తీయించలేదు. ఎవడైనా పరుగులు తీసే వాడిని చూసినా వీడెక్కడ బోర్లపడతాడో అని మనం జాలిగా చూసే వాళ్లం.

ఇప్పుడంతా తలకిందులు. పరుగులు తీయని వాడిని జాలిగా చవటలాగా చూసే రోజులు వచ్చిపడినాయి. ఇదిగో ఇలా పరుగులు తీస్తున్న నా కొడుకు నిర్వాకమే ఇదంతా..." అంటూ ఆగినాడు వెంకటరత్నం.

విషయాలు చాలా వరకూ అర్థమైపోయినాయి, నాకు ఆ మాటలతో. ఇది కేవలం తరాల అంతరాలకు సంబంధించిన అంశం మాత్రమే కాదు. ఇప్పటి తరాన్ని నడిపిస్తున్న తీవ్రమైన శక్తులకు సంబంధించిన అంశం ఇది!

"నా కొడుకు ఉద్యోగంలో చేరి 15 సంవత్సరాలయింది ఇప్పటికి. యాదృచ్ఛికంగా దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు ప్రారంభమై కూడా 15 సంవత్సరాలు. ఒకప్పుడు

సంపన్నులకు మాత్రమే ఊడిగం చేసే మార్కెట్, ఈ 15 ఏళ్లలో మధ్యతరగతి నడినెత్తి మీద నాట్యం చేసే స్థితికి చేరుకుంది. తొలిదశలో 'లగ్జరీస్' అనుకున్నవి, ఆ తర్వాత 'కంఫర్ట్స్'గా మారి, ఇప్పుడు 'నెసెసిటీస్'గా రూపు దాల్చటం క్రమంగా సాగిన మార్కెట్ పరిణామం. ఈ పరిణామాలకు ఇప్పటి తరం తమకు తెలియకుండానే బలి కావటం మన కళ్ల ఎదుట కన్పిస్తున్న విషాదం"–

ఈ మాటలంటున్నప్పుడు వెంకటరత్నం గొంతు వణికినట్టు నాకనిపించింది. అతని మానసిక సంక్షోభం ఏమిటో నాకర్థమయింది...

నాలుగైదు నిమిషాలాగి వెంకటరత్నం మళ్లీ ప్రారంభించినాడు. "నా కొడుకూ, కోడలూ ఉద్యోగాలు చేస్తూ, ఇద్దరూ నలభైవేలకు పైగానే సంపాదిస్తున్నారు. నాకూ పదివేల దాకా పెన్షన్ వస్తూ వుంది. ఈ మొత్తంతో మేము ఎంత హాయిగా జీవించవచ్చు. అయినా జీవితంలో శాంతి లేదు" అంటున్న అతని కంఠస్వరంలో ఒక నిర్వేదం తొంగి చూసింది.

"వాళ్ల పిల్లలకిప్పుడు ఈ వూరి చదువు పనికి రాదు. ఈ వూరి స్కూళ్లు వాళ్ల అంతస్తుకూ, స్థాయికీ పనికిరావు. వాళ్ల పిల్లలు కార్పొరేట్ కాలేజీల్లో హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. వాళ్లకిప్పుడు ఒకటే పని!

డబ్బు, డబ్బు!!

సంపాదన కోసం పరుగులు తీయటం.

ఇక ఈ ఇంటి విషయం – ఇంటి పని మొదలు పెట్టినప్పటి నుండీ నెత్తీ నోరూ కట్టుకొని పోరుతున్నాను... ఇంత ఇల్లు మనకు అక్కరలేదురా, అంత డబ్బు మన దగ్గర లేదురా అని. అంటే వింటారా? మనం మన జేబులోంచి తీసి కడుతున్నామా? బోలెడు బ్యాంకులున్నాయి. పిలిచి అప్పులిస్తున్నాయి అంటాడు.

వీళ్లిద్దరూ చేసేవి టీచర్ ఉద్యోగాలు. వద్దురా అంటే వినకుండా కారొకటి కొన్నాడు. ఇంటి నిండా విలాస వస్తువులు. వద్దు అంటే కాలం మారింది నాన్నా! మారిన కాలానికి అనుకూలంగా మనమూ మారాలి అంటాడు". వెంకటరత్నం చెబుతున్నది కేవలం తన కొడుకు విషయమే కాదు అనిపించింది. ఈ రోజుల్లో నేలమీద పాదాలు మోపి నడిచే తరమే కనిపించటం లేదు గదా! తాము ఎవరినో బతికిస్తున్నామన్న స్పృహే లేదుగదా ఈ తరానికి!

వెంకటరత్నం ఆగకుండా చెబుతూనే వున్నాడు. "సాధారణ మధ్యతరగతి జీవితం ఇప్పుడు వీళ్లకు కంపు. మార్కెట్ ప్రలోభంతో వస్తు వ్యామోహ సంస్కృతితో వీళ్ల బుర్రలు పాడైపోయినాయి. ప్రపంచీకరణ దాడి అంటే ఎక్కడో లేదు – అది మొదట మన ఇళ్ల మీద దాడితోనే ప్రారంభమౌతుంది. మనల్ని నిలువునా ముంచేస్తుంది అంటే వెటకరిస్తాడు నా కొడుకు!

నువ్వు చదువుకున్న పుస్తకాల జ్ఞానంతో ప్రపంచాన్ని తూంచవద్దు అంటాడు. ప్రపంచీకరణ అంటే పెద్ద సంతరా నాయనా! అవి మనలాంటి వాళ్లను బలి పశువులు చేస్తాయి అంటే ఒప్పుకోడు!

చేతికందిన చోటల్లా అప్పులు. ఇటీవలే ఒక మిత్రునితో చేరి రియల్ ఎస్టేట్ బిజినెస్‌లో తలదూర్చాడు. అది చాలక ఒక బి.ఇడి. కాలేజీ శాంక్షన్ కోసం మరో ముగ్గురితో కలిసి చెడ తిరుగుతున్నాడు. ఇక నా బోటి వానికి మౌనం తప్ప మరో దారిలేదు... వీళ్లు వీళ్లుగా కాక మరెవరిలాగానో, మరెవరో నడిపిస్తున్న మనుషుల్లాగానో నడుస్తున్నారు..." అంటూ ఏవేవో చెబుతూనే వున్నాడు వెంకటరత్నం.

❖ ❖ ❖

ఒక సంవత్సరం తర్వాత...

ఒక రోజు ఉదయమే ఫోన్...

ఫోన్‌లో వెంకటరత్నం గొంతు – విషాదంతో పూడుకు పోయినట్టున్న స్వరం – ఒక చెక్ బౌన్స్ కేసులో తన కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేసి నాన్ బెయిలబుల్ కేసు పెట్టినారనీ, ఉద్యోగ విధుల నుండి సస్పెండ్ అయినాడనీ, అప్పులు పెరిగి ఇల్లు అమ్మకానికి పెట్టే పరిస్థితి వచ్చిందనీ... ఇలా చెబుతూనే ఉన్నాడు. వీలైతే నన్ను యాభైవేలు అర్జంట్‌గా సర్దమన్నాడు.

చాలా దుఃఖం కలిగింది నాకు. మధ్యాహ్నానికల్లా యాభైవేలు సమకూర్చుకొని వెంకటరత్నాన్ని పరామర్శించటానికి బయలుదేరాను.

**❖ ఆంధ్రజ్యోతి, ఆదివారం సంచిక, 2008**